
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
ఆదివారం 4 ఆగస్టు 2024



స్నేహం.. దేవుడిచ్చిన వరం
కష్టసుఖాల్లో పాలుపంచుకునేది స్నేహితులే
నేడు స్నేహితుల దినోత్సవం
7 లో





సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకుని ఆందోళన చేస్తున్న రైతులు

మా భూమికి బదులు

భూమి ఇవ్వాల్సిందే..

'ట్రిపుల్‌ఆర్' రోడ్డు కోసం మా పొట్టకొడతారా?

పరిహారంపై స్పష్టత ఇచ్చేవరకు భూములివ్వం

సర్వేను అడ్డుకున్న రెడ్డిపల్లి రైతులు

అధికారులతో వాగ్వాదం.. ఆందోళన

నర్సాపూర్, ఆగస్టు 3: ట్రిపుల్‌ఆర్ రోడ్డు కోసం తమ భూమి ఇవ్వాలంటే మరో చోట అందుకు సమానమైన భూమి ఇవ్వాల్సిందేనని రైతులు స్పష్టం చేశారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలో శనివారం సర్వే కోసం వెళ్లిన అధికారులను అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. ట్రిపుల్‌ఆర్ నిర్మాణం కోసం డివిజన్ పరిధిలోని నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లోని 17 గ్రామాల్లో భూసేకరణ చేపట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. 13 గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తికాగా.. నాలుగు గ్రామాల్లో సర్వేను రైతులు అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ఇటీవల కలెక్టర్ రాహుల్‌రాజ్ రైతులతో చర్చించడంతో.. మూడు గ్రామాల రైతులు భూములిచ్చేందుకు అంగీకరించారు. దీంతో అయా గ్రామాల్లో సర్వే పూర్తిచేశారు. చివరగా రెడ్డిపల్లి గ్రామంలో సర్వే చేయడానికి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బృందం వెళ్లింది. సీఐ జాన్‌రెడ్డి పోలీసులు భద్రత కల్పించారు. విషయం తెలుసుకున్న రైతులు అధికారులను అడ్డుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు జోక్యం చేసుకున్నారు. దీంతో, రైతులు వారితో వాగ్వాదానికి దిగారు. ఇప్పటికే రెడ్డిపల్లి మీదుగా కాళేశ్వరం కాలువ, విద్యుత్ హైటెన్షన్ వైర్లు వేయడం కోసం భూములు తీసుకున్నారని, అరకొర పరిహారం మాత్రమే ఇచ్చి సరిపెట్టారని వాపోయారు. మరోసారి భూములిచ్చేందుకు తాము సిద్ధంగా లేమని తెలిపారు. మా పొట్ట కొట్టి ఎవరి కోసం రోడ్డు వేస్తున్నారని నిలదీశారు. భూములు నష్టపోకుండా అలైన్‌మెంట్ మార్చాలని, సాధ్యం కాకపోతే భూమికి బదులు మరోచోట భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదా, మార్కెట్‌లో ఉన్న ధరను చెల్లించాలని స్పష్టం చేశారు. ఉన్నతధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు సర్వే చేయనివ్వబోమని తేల్చిచెప్పారు. తమ భూముల్లో సర్వే చేయొద్దని ఆందోళన చేశారు. దీంతో, అధికారులు సర్వే చేయకుండానే వెనుదిరిగారు.

ముందు మున్సిపాలిటీలోకి..

తర్వాతే జీహెచ్‌ఎంసీలోకి..

ఓఆర్ఆర్ పరిసర గ్రామాల విలీన ప్రతిపాదన

ముందు తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల్లోకి..

పాలకవర్గాల గడువు ముగిసన తరువాత 'గ్రేటర్'లోకి

అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘం

మిగతా గ్రామాల పరిస్థితిపై సందిగ్ధత?

పటాన్‌చెరు, ఆగస్టు 3: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని నెహ్రూ ఔటర్ రింగ్‌రోడ్డు పరిసరాల్లోని గ్రామ పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ముందుగా పక్కనే ఉన్న మున్సిపాలిటీలో విలీనం చేసి.. అనంతరం మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. గ్రామ పంచాయతీలను నేరుగా కార్పొరేషన్‌లో విలీనం చేయడం వల్ల న్యాయపరమైన చిక్కులు వస్తాయని భావించి అధికారులు ఈ నిర్ణయానికి వచ్చారు. ప్రస్తుత మున్సిపాలిటీల పాలకమండలి పదవీ కాలం ముగిసిన వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈమేరకు అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల క్యాబినెట్ సమావేశంలో ఆదేశాలు జారీచేశారు.


11 పంచాయతీలు..

సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో పరిధిలోకి వచ్చే ఔటర్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల ఉన్న 41 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో సంగారెడ్డి జిల్లాలోని 11 పంచాయతీలు ఉన్నాయి. తొలుత వీటిని పక్కనే ఉన్న మున్సిపాలిటీల్లో విలీనం చేస్తారని సమాచారం. పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్, ఐలాపూర్‌తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, దాయర, సుల్తాన్‌పూర్ గ్రామ పంచాయతీలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. పటాన్‌చెరు మండల పరిధిలోని పోచారం, ముత్తంగి, కర్ధనూర్, పాటి, ఘనపూర్ పంచాయతీలను తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు పంపారు. అమీన్‌పూర్ మండలంలోని వడక్‌పల్లి, జానకంపేట గ్రామ పంచాయతీలు, పటాన్‌చెరు మండల పరిధిలో ఇస్నాపూర్, ఇంద్రేశం, పెద్ద కంజర్ల, చిన్నకంజర్ల, లక్డారం, చిట్కుల్, క్యాసారం, పాషమైలారం, రుద్రారం, నందిగామ, భానూర్ గ్రామాలు పంచాయతీలుగానే కొనసాగనున్నాయని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా తెలియజేశారు. అమీన్‌పూర్ మండల పరిధిలో కేవలం రెండు గ్రామ పంచాయతీలు మాత్రమే మిగలనున్నాయి. రెండు గ్రామాలకే జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితిపై చర్చ జరుగుతోంది. మరోవైపు భానూర్ లేదా ఇస్నాపూర్ గ్రామాలను కేంద్రంగా చేసుకుని ఒక మున్సిపాలిటీ ఏర్పాటు చేసే అవకాశం లేకపోలేదని భావిస్తున్నారు. విలీనంపై త్వరలోనే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను, ఇన్‌చార్జి మంత్రులతో సీఎం చర్చించి అభిప్రాయాలు తీసుకునే అవకాశాలున్నాయని తెలుస్తున్నది. విలీనం పూర్తయితే పటాన్‌చెరు అసెంబ్లీ నియోకవర్గం సగానికి పైగా నగరంలో కలుస్తుంది.



విలీనం తరువాతే 'గ్రేటర్' ఎన్నికలు?

ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం తరువాతే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీనగర్ పట్టణాలు గ్రేటర్‌లో విలీనమయ్యాయి. ప్రస్తుతం మూడు మున్సిపాలిటీలు, 11 పంచాయతీలను సైతం గ్రేటర్‌లో కలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మొగ్గు చూపుతున్నారు. దీంతో, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్ల పదవుల స్థానంలో కేవలం కార్పొరేటర్ పదవులు రాబోతున్నాయి. జీహెచ్‌ఎంసీ పాలకమండలి పదవీకాలం డిసెంబర్ 1న, మున్సిపాలిటీలకు 2025 జవనరి నెలతో పదవీకాలం ముగుస్తుంది. ఆ తరువాతే గ్రేటర్ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.



రైతు రుణమాఫీకి సహకరించాలి

రైతులకు 'ఈసీ', 1–బీ ఉచితంగా ఇవ్వాలి

జిల్లా కోఆపరేటివ్ అధికారి కరుణ



మహ్మద్‌నగర్ సొసైటీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ కరుణ

కౌడిపల్లి, ఆగస్టు 3: మహ్మద్‌నగర్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయాన్ని జిల్లా కోఆపరేటివ్ అధికారి కరుణ తనిఖీ చేశారు. 'ఈసీ పేరిట రైతుల నుంచి వసుళ్లు' అనే శీర్షికతో శనివారం 'ఆంధ్యజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఆమె స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సహకరించాలని సిబ్బందిని ఆదేశించారు. రుణమాఫీ చేసే సమయంలో ఈసీ, 1-బీ రైతులకు ఉచితంగా అందించాలని స్పష్టం చేశారు. మీసేవా కేంద్రాల్లో తీసుకురావల్సిన అవసరం లేదని డిసెంబర్ 8, 2023 నుంచి ఇప్పటివరకు వడ్డీ చెల్లిస్తే రుణమాఫీ చేసి, తిరిగి రుణం అందిస్తామని పేర్కొన్నారు. రైతులను రుణాలు ఇచ్చే క్రమంలో ఇబ్బందులకు గురిచేయొద్దని తెలిపారు. అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటుచేయాలని తెలిపారు. రుణాలు పొందేందుకు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ ఇస్తే ఈసీ, 1-బీ సర్టిఫికెట్లు ఉచితంగా అందించి రుణాలు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌడిపల్లి డీసీసీబీ బ్యాంకు మెనేజర్ ప్రజిమరెడ్డి, పీఏసీఎస్ సీఈవో దుర్గాగౌడ్, ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, స్పెషల్ ఆఫీసర్ సంగమేశ్వర్, సిబ్బంది విష్ణు, సుధకర్, అనిల్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలు, సైబర్ నేరాలపై ఉక్కుపాదం

- నేరాల అదుపులో సంగారెడ్డి జిల్లా పోలీసులు భేష్
- మల్టీ జోన్ ఐజీ సత్యనారాయణ

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 3 : డ్రగ్స్, సైబర్‌నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని మల్టీ జోన్ ఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన జిల్లా పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. శాంతభద్రతల పరిరక్షణ, నేరాల నివారణపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నేరాలను అదుపు చేయడంలో సంగారెడ్డి జిల్లా పోలీసుల పనితీరు బాగుందని అభినందించారు. ప్రభుత్వం, డీజీపీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలతో పాటు గంజాయి, మత్తుపదార్థాలను సహించేది లేదన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో పంటపొలాల్లో గుట్టుగా గంజాయిని సాగు చేస్తున్నట్టు సమాచారం ఉందని తెలిపారు. దీనిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 161, 66 జాతీయ రహదారుల మీదుగా మత్తుపదార్థాల అక్రమరవాణా చేయంగా కట్టుదిట్టం చేసినట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు, కొంకరాయి, వైజాగ్ నుంచి తెలంగాణ గుండా కర్ణాటక, మహారాష్ట్రకు గంజాయి, మత్తు పదార్థాలను తరలిస్తున్నట్టు తెలుస్తున్నది పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని సరిహద్దుల్లో చేపడుతున్న ముమ్మర తనిఖీల్లో పెద్దమొత్తంలో మత్తుపదార్థాలు పట్టుబడుతున్నాయని తెలియజేశారు. గంజాయి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. అలాగే, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. సైబర్ నేరాలు, లోన్ యాప్‌లు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అపరిచితు ఫోన్ చేసి లోన్‌లు, బహుమతులు ఇస్తామని చెప్తే నమ్మి మోసపోవద్దని సూచించారు. సమావేశంలో ఎస్పీ చెన్నూరి రూపేష్, ఏఎస్పీ సంజీవ్‌రావు, డీఎస్పీలు వెంకట్‌రెడ్డి, సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మల్టీ జోన్ ఐజీ సత్యనారాయణ

స్వచ్ఛదనం.. పచ్చదనం

- రేపటి నుంచి 9 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- రోజువారీ షెడ్యూల్‌ను విడుదల చేసిన ప్రభుత్వం
- విజయవంతం చేయాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



స్వచ్ఛదనం-పచ్చదనంపై సమీక్ష నిర్వహిస్తున్న మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, ఆగస్టు 3: పట్టణాలు, పల్లెల్లో ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

తొలి రోజు కార్యక్రమాలు ఇలా..

ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, యువతతో అవగాహన ర్యాలీలు నిర్వహించాలి. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి, అక్కడ కంపోస్టు ఎరువులు తయారు చేయాలి. పాఠశాలల్లో పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, తోటల పెంపకం, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. ప్రభుత్వ సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతిగృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్‌లు, ఇతర ప్రభుత్వ స్థలాలను శుభ్రం చేయించాలి. మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి, 15 రోజుల్లో నూతనంగా అనుమతులు జారీ చేసి పూర్తి చేయించాలి.

రెండో రోజు..తాగునీటి వనరులను శుభ్రం చేయాలి. క్లోరినేషన్ కిట్లను అందుబాటులో ఉంచాలి. తాగునీటి చెరువులు, కుంటలు, కలుషితం కాకుండా స్థానికులకు అవగాహన కల్పించాలి. ఇంకుడు గుంతలు లేని ఇళ్ల వద్ద వాటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి. తాగునీటి సరఫరా సరిగా లేని ప్రాంతాలను గుర్తించి అక్కడికి శుద్ధనీరు పంపిచేలా చూడాలి.

మూడో రోజు...

మురుగు కాలువల పూడిక తీయించాలి. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడన్న నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలి. గుంతలు ఉన్న ప్రాంతాల్లో మొరం పోసి చదును చేయించాలి. నీరు బయటకు వెళ్లలేని ప్రాంతాల్లో, నీరు నిల్వ ఉన్నచోట ఇంకుడు గుంతలు నిర్మించాలి. చేతి పంపులు, పైప్‌లైన్లు వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి.

నాలుగో రోజు...

వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. జ్వర సర్వే నిర్వహించాలి. జ్వరాలు ఎక్కువగా ఉన్న చోట వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అయిల్ బాల్స్ వేయించాలి. అంతలా యాంటీ లార్వా రసాయనాలతో పిచికారి చేయించాలి. ఎనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) సెంటర్లు ఏర్పాటు చేయాలి. వీధి కుక్కల సంఖ్య తేల్చి మున్సిపల్ కమిషనర్లు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో వాటిని ఏబీసీ కేంద్రాలకు తరలించాలి.

ఐదవ రోజు..

ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డేగా పాటించాలి. వర్షం నీటి నిల్వలను తొలగించాలి. అన్ని ప్రభుత్వ సంస్థల పైకప్పులు, పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్ ప్రాంగణాలను తనిఖీ చేయాలి. గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను, మోడుబారి కుళ్లిపోయిన చెట్లను తొలగించాలి.

వనమహోత్సవం..

ఐదు రోజులు పట్టణాలు, పల్లెల్లో వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలి. వన్య ప్రాణులకు ఆహారాన్నిచ్చే, అటవీ ఉత్పత్తులనిచ్చే మొక్కలను నాటి సంరక్షించాలి. పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లోని కిచెన్‌గార్డెన్‌లో పండ్ల మొక్కలు నాటాలి. ప్రతీ ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేయాలి. గ్రామ పంచాయతీ, పట్టణాల్లో ప్రభుత్వ ఆస్తులను గుర్తించి వాటిని జియోట్యాగింగ్ చేయించాలి.

పాఠాలకు టాటా..

వంట చేస్తున్న టీచర్, మరో ఉద్యోగి



చెట్ల కొమ్మలు తొలగించేందుకు పాఠశాల భవనం పైకెక్కిన విద్యార్థులు





పాఠ్యాంశాలు బోధించాల్సిన ఉపాధ్యాయులు పాఠశాల సమయాన్ని వృథా చేస్తున్నారు. మండల పరిధిలోని గోమారం పాఠశాలలో శనివారం కాంప్లెక్స్ సమావేశానికి వచ్చిన ఉపాధ్యాయులకు భోజనం ఏర్పాటు చేయడం కోసం ఇద్దరు టీచర్లు, ఓ జూనియర్ అసిస్టెంట్ సమీపంలోని వసతిగృహం హాస్టల్‌లో వంట చేస్తూ కనిపించారు. అదే సమయంలో ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న భారీ వృక్షాల ఎండుకొమ్మలను వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థులతో తొలగింపజేశాడు. ఇందుకోసం కొందరు విద్యార్థులు ప్రమాదకరంగా చెట్లపైకి ఎక్కారు. పట్టుజారితే పిల్లల పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు.

-శివ్వంపేట

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చేర్యాల, ఆగస్టు 3: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాలకు చెందిన పుల్లం వెంకటనర్సయ్య(68) శుక్రవారం అర్ధరాత్రి ఇంటి నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై హోటల్‌కు వెళ్తున్నాడు. బస్టాండ్ సమీపంలో జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి దాటుతుండగా సిద్దిపేటకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన వెంకటనర్సయ్యను స్థానికులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజుగౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎంలో అక్రమంగా పశువుల తరలింపు

గుమ్మడిదల, ఆగస్టు 3: డీసీఎంలో పశువులను అక్రమంగా తరలిస్తుండడంతో నల్లవల్లి గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పశువులను అక్రమంగా డీసీఎంలో నిర్బంధించి తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. పశువుల తరలింపుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వెంటనే గుమ్మడిదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు డీసీఎంను పోలీసుస్టేషన్‌కు తరలించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు డ్రైవర్ మహ్మద్ రహీంతో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గ్రామస్థుల కోరిక మేరకు పశువులను గోశాలకు తరలించినట్లు చెప్పారు.


డీసీఎంలో ఉన్న పశువులు

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

చేర్యాల, ఆగస్టు 6: కుటుంబ కలహాలతో వ్యక్తి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేర్యాల మండలం చిట్యాలకు చెందిన మ్యాక సత్తయ్య(37) రైతు. కుటుంబ అవసరాల కోసం కొంత అప్పు చేశాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసగా మారాడు. అప్పులు ఎలా తీరుతాయని భార్యాభర్తల మధ్య రెండురోజుల క్రితం తగాదా జరిగింది. భార్య కృష్ణవేణి పనులకు వెళ్లగా, సత్తయ్య తండ్రి ఐలయ్య ఇంటి వద్ద ఉన్నారు. కొద్దిసేపటికి సత్తయ్య పురుగుల మందు తాగగా.. తండ్రి గమనించి చుట్టుపక్కల వారిని పిలిచాడు. వారు 108 అంబులెన్స్‌లో చేర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.


మర్పడగ విజయ దుర్గామాత ఆలయం


కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గలఅష్టాదశ శక్తిపీఠ ఆలయం


సిద్దిపేట వేంకటేశ్వర ఆలయం

శోభాయమానం.. శ్రావణమాసం

- సకల సౌభాగ్యలందించే శ్రావణం రేపటి నుంచే ప్రారంభం
- నెలపాటు ఆధ్యాత్మిక వాతావరణం
- పూజలు, పునస్కారాలు, వ్రతాలకు ఈ నెల పెట్టిందిపేరు
- కిటకిటలాడనున్న ఆలయాలు

కొండపాక, ఆగస్టు 3: సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టినిల్లు మనది. తెలుగు నెలల్లో ప్రతినెలా ఏదో ఒక ప్రత్యేకతను చెబుతుంది. అలాంటి దాంట్లో శ్రావణ మాసం ఒకటి. ఈ మాసంలో పండుగలతో పాటు ఆలయాలు నెలరోజుల పాటు భగవన్నామస్మరణతో మారు మోగుతాయి. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా ఎంతో పవిత్రత ఉంటుందంటున్నారు పండితులు. అంత గొప్ప పవిత్రమాసం సోమవారంతో ప్రారంభమవుతుంది. సనాతన ధర్మంలో చంద్రమానం ప్రకారం తెలుగు మాసాల్లో ఇది ఐదవది. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు శ్రావణ నక్షత్రంలో సంచరించడం వలన ఈ మాసానికి శ్రావణమాసం అని పేరు వచ్చింది. వివిధరకాల పూజలు, వ్రతాలు ఆచరించడం వల్ల విశేష ఫలితాలు ప్రసాదించే మాసంగా పెద్దలు చెబుతారు. ఈ మాసంలో చేసే దైవ కార్యాలకు ఎంతో శక్తి ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి.

సంస్కృతి సంప్రదాయాల మాసం

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలలో 'శ్రావణ మాసం' అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. ఈ మాసంలో ముఖ్యమైనవి పండుగలు వరలక్ష్మీవ్రతం, మంగళగౌరీ వ్రతం, రాఖీపౌర్ణమి.

శివారాధనకు ఎంతో విశిష్టత

శ్రావణమాసం దక్షిణాయనంలో వచ్చే విశిష్టమైన మాసాల్లో శ్రావణమాసం ఒకటి. ఈ మాసం శివపూజకు విశిష్టమైనది. ముఖ్యంగా భగవదారాధనలో శివ, కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైనది. ఈ నెలలో చేసే ఏ చిన్న దైవ కార్యమైనా కొన్ని వేల రెట్లు శుభ ఫలితాన్నిస్తుందని ప్రతీతి. స్వామివారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేస్తారు.

మంగళ గౌరీ వ్రతం

శ్రావణమాసంలో అన్ని మంగళవారల్లో చేసే వ్రతమే మంగళగౌరీ వ్రతం. దీన్ని శ్రావణ మంగళవార వ్రతం అనీ, మంగళగౌరీ నోము అని వివిధ రకాలుగా పిలుస్తుంటారు. వివాహమైన తర్వాత వచ్చే శ్రావణంలో ఈ వ్రతాన్ని చేయడం ప్రారంభిస్తారు. శ్రావణమాసంలో వచ్చే అన్ని మంగళవారాల్లో ఈ వ్రతం చేస్తారు.

వరలక్ష్మి వ్రతం

శ్రావణమాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్ర వారం ఈ వ్రతం చేస్తారు. ఒకవేళ అప్పుడు వీలుకాకుంటే శ్రావణ మాసంలో మరొక శుక్ర వారమైనా ఈ వ్రతం ఆచరించవచ్చని పండితులు సూచిస్తున్నారు.


మర్పడగ విజయదుర్గా మాత

రాఖీ పౌర్ణమి

శ్రావణపౌర్ణమి, రాఖీ పౌర్ణమిగా జరుపుకునే ఈరోజు సోదర, సోదరీ సంబంధానికి సూచికగా రక్షాబంధనం జరుపుతారు. అంతేకాకుండా ఈ రోజున నూతన యజ్ఞోపవిత్రధారణ చేస్తారు. ఇవే కాకుండా కృష్ణపాడ్యమి, హయగ్రీవ జయంతి, కృష్ణపక్ష విదియ, రాఘవేంద్రస్వామి ఆరాధన వంటి ముఖ్య రోజులు వచ్చేవి శ్రావణ మాసంలోనే. కృష్ణాష్టమి, పొలాల అమావాస్య, గోవులను పూజించడం వంటివి సైతం ఈ నెలలో రావడం ప్రత్యేకత. ఎన్నో విశిష్టతలను సొంతం చేసుకున్న ఈనెలలో చేయాల్సిన విధులు, పూజలు, వ్రతాలు, నియమాలు, తూచ తప్పకుండా ఆచరిస్తే సకల సౌభాగ్యాలు కలుతాయనే భావన.

గురుకులంలో తప్పెవరిది..!

- ఉపాధ్యాయురాలి కోసం రోడ్డెక్కిన విద్యార్థులు
- కలెక్టర్ ఆదేశాలతో ఎంఈవో విచారణ


విద్యార్థులు రోడ్డెక్కడానికి గల కారణాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్న ఎంఈవో దశరథ్

మునిపల్లి, ఆగస్టు 3: సంగారెడ్డి జిల్లా మండల పరిధిలోని లింగంపల్లి గురుకుల కళాశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న రజినిరెడ్డి గతనెల 24న బదిలీపై వెళ్లింది. అయితే పాఠశాలకు తెలుగు టీచర్ రాలేదు. బదిలీ అయిన విషయం విద్యార్థులకు తెలియకపోవడంతో గతనెల 26న ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రిన్సిపాల్ సురభి చైతన్య వద్దకెళ్లి తెలుగు టీచర్ రజినిరెడ్డి కళాశాలకు ఎందుకు రావడం లేదు సార్ అంటూ అడిగారు. ఇందుకు ప్రిన్సిపాల్ నుంచి ఎలాంటి స్పందన రాలేకపోవడంతో చేసేదేమి లేక గతనెల 30న టీచర్‌ను తిరిగి రప్పించాలంటూ 165 ముంబయి జాతీయ రహదారిపై రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఈ విషయాన్ని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి సీరియస్‌గా తీసుకుని గురువారం గురుకుల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు రోడ్డు పైకి వెళ్లి ధర్నా చేసేంతవరకు మీకు తెలియదా.. వారు బయటకు వెళ్తే.. మీరు ఏం చేస్తున్నారని ప్రిన్సిపాల్ చైతన్యతోపాటు సిబ్బందిని నిలదీశారు. దీంతో వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో విచారణ చేపట్టాలని ఎంఈవో దశరథ్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఈవో దశరథ్ శనివారం కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మీరు ఎందుకు రోడ్డు పైకి వెళ్లి ధర్నా చేయాల్సి వచ్చింది. ఎవరైనా చేయండని ప్రేరేపించారా.. అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎక్కడికి వెళ్తున్నారో అడగాల్సిన బాధ్యత మీకు లేదా అంటూ పీఈటీ, ఉపాధ్యాయులపై ఎంఈవో మండిపడ్డారు. విద్యార్థులు ధర్నా చేసిన రోజు ప్రిన్సిపాల్ అందుబాటులో లేకపోగా.. ఇన్‌చార్జి బాధ్యతలను ఎవరికీ అప్పగించకపోవడంతో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంపై విచారణ చేసి కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఎంఈవో తెలిపారు.



స్నేహం.. దేవుడిచ్చిన వరం

- కష్టసుఖాల్లో పాలుపంచుకునేది స్నేహితులే
- నేడు స్నేహితులు దినోత్సవం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 3: సృష్టిలో అమ్మ ప్రేమది మొదటి స్థానమైతే... స్నేహానిది రెండో స్థానమని చెప్పవచ్చు. స్నేహం అనేది ఇద్దరు పురుషులు, ఇద్దరు బాలికల మధ్య ఉండడమే స్నేహం కాదు. బాల, బాలికల మధ్య కూడా పవిత్రమైన స్నేహం ఉంటుంది. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు అందరికీ స్నేహితులు ఉంటారు. సమాజంలో అమ్మ తరువాతి స్థానం స్నేహానిదే. అమ్మ తన బిడ్డల కోసం సర్వం త్యాగం చేస్తే స్నేహం తన మిత్రుల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమవుతారు. స్నేహం భగవంతుడు ప్రసాదించిన వరం. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న కథనం.

ఈ సృష్టిలో తోబుట్టువులు, బంధువులు లేనివారు ఉండవచ్చు కానీ స్నేహితులు లేని వారు మాత్రం ఉండరనేది జగమెరిగిన సత్యం. స్నేహితులు అనగానే మనకు ముందుగా గుర్తుకువచ్చేది మహాభారతంలోని కర్ణుడు. తన స్నేహితుడు దుర్యోధనుడి కోసం తన కుటుంబసభ్యులతో సైతం యుద్ధానికి పూనుకుంటాడు. కృష్ణుడు, కుచేలుడు, రామాయణంలో రాముడు, సుగ్రీవుడుల స్నేహం చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. పురాణ గాధలు మహాభారతం నుంచి నేటివరకు స్నేహానికి ప్రాధాన్యత సంతరించుకుని ఉన్నది. స్నేహితులుగా ఉంటూ ఎందరో తమ మిత్రుల కోసం ప్రాణ త్యాగాలు చేసినట్లు చరిత్ర చెబుతున్నది. ఎవరైనా ఒకరితో స్నేహం చేసే ముందు కులం, మతం, ప్రాంతాలు అడగరు. నిజమైన మిత్రులకు ఆస్తి లేదనే చెప్పాలి. స్నేహానికి ఎల్లలు, సరిహద్దులు చేరిపేశక్తి ఉంటుంది. తల్లి దండ్రులు, అన్నదమ్ములతో పంచుకోలేనివి స్నేహితునితో పంచుకుంటారు. మంచి స్నేహం ప్రారంభదశ నుంచి మహావృక్షంలా ఎదుగుతుంది.

స్నేహితుల మధ్య దూరం పెంచిన స్మార్ట్‌ఫోన్లు

గతంలో కొత్త సంవత్సర వేడుకలు వచ్చాయంటే చాలు తమ స్నేహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ డిజైన్లలో గ్రీటింగ్ కార్డులను ఇచ్చేవారు. స్నేహితుల బ్యాండ్లు ఒకరికొకరు చేతులకు వేసుకుని శుభాకాంక్షలు చెప్పుకునేవారు. కానీ ప్రస్తుతం మార్కెట్‌లోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్ల పుణ్యమా అని స్నేహితుల మధ్య దూరం పెరిగింది. గతంలో తమ ఇంటిలో పెళ్లిళ్లు, బర్త్‌డే ఇతరత్రా శుభకార్యాలు జరిగితే ఎంత దూరమైనా వారి వద్దకు వెళ్లి పత్రికలు అందించి ఆహ్వానించేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారిపోయింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడమే కాకుండా తమ ఇళ్లలో పెళ్లితో సహా బర్త్‌డేలు జరిగినా ఫోన్‌లో కార్డు పంపించడం ఆనవాయితీగా మారిపోయింది.

జీవితంలో ఓ భాగమైన స్నేహితులు



స్నేహితులు జీవితంలో ఓ భాగమై పయనం సాగుతుంది. కష్టసుఖాల్లో అంటిపెట్టుకుని ఉండే వాడే నిజమైన స్నేహితుడు. తనకు బాల్యమిత్రులు ఇప్పటికీ కలుస్తూ తనతో వారి కష్టాలు పంచుకుంటారు. తనకు ఎల్లప్పుడూ ధైర్యాన్నిచ్చే స్నేహితుడు శ్రీనివాస్. అతడితో కలిస్తే తనకు పోయిన ఊపిరి వచ్చినట్లవుతుంది.

- రాజు, ఇరిగ్గిపల్లి గ్రామం, సంగారెడ్డి మండలం

స్నేహితుడిని మరిచిపోవద్దు



ఆపదలో ఉన్న స్నేహితుడిని ఆదుకుని ఒడ్డున చేర్చేవాడే నిజమైన స్నేహితుడు. కష్టాలు వచ్చినప్పుడు అండగా నిలిచిన స్నేహితుని మరిచిపోవద్దు. స్నేహితుడిని ద్వేషించకు.. అతనిలోని గుణాలను ద్వేషించి మంచి మార్గంలో పెట్టగలిగేవారిదే నిజమైన స్నేహం. తనకు అధికంగా దగ్గరగా ఉండే స్నేహితుడు ఏపీవో వెంకట్. అతను కలిసిన ప్రతిసారి తమ బాగోగులు, కష్టసుఖాలు పంచుకుంటాం.

- ఏపీజీకే ప్రసాద్, ఏవో, సంగారెడ్డి ప్రత్యేకాధికారి

స్నేహితుడికి చేయూత

జగదేవ్‌పూర్, ఆగస్టు 3: జగదేవ్‌పూర్ మండలం మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్నేహితుడికి ఆర్థిక చేయూతనిచ్చారు. దొమ్మట బాలరాజు ఇటీవల అనారోగ్యంతో ఆర్‌వీఎం ఆస్పత్రిలో చేరాడు. ఆపరేషన్‌కు లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు శనివారం ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు. అనంతరం రూ.43 వేల ఆర్థిక సహాయం అందించి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహేష్‌యాదవ్, సత్యనారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్


సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్/మెదక్/సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 3: ధరణి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్లను సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శనివారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించి, ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సక్సేషన్ పెండింగ్, మ్యుటేషన్ లాంటి దరఖాస్తుల రికార్డులను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, ఆర్డీవో వసంతకుమారి, కలెక్టరేట్ ఏవో పరమేశం, మెదక్ నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్లు, సిద్దిపేట నుంచి కలెక్టర్ మనుచౌదరి, డీపీవో దేవకీదేవి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సిర్గాపూర్ కేజీబీవీలో అధికారుల విచారణ

కల్హేర్, ఆగస్టు 3: మండల కేంద్రమైన సిర్గాపూర్ కేజీబీవీలో బోధన సిబ్బంది ఫిర్యాదుకు స్పందించిన సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు శనివారం విచారణ జరిపినట్లు తెలిసింది. కేజీబీవీ ప్రత్యేకాధికారి లలిత తోటి సిబ్బందితో అమర్యాదగా ప్రవర్తించడానికి తోడు తనకున్న అధికారాలను ఉపయోగించుకుని సిబ్బందిని నిత్యం ఇబ్బందులు, వేధింపులకు గురిచేస్తుంది. ఈ విషయమై సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంగారెడ్డి సర్వశిక్షా అభియాన్ కమ్యూనిటీ మొబిలైజేన్ అధికారి(సీఎంవో) వెంకటేశ్, జీసీడీవో సుప్రియ, అకడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంవో) అనురాధ శనివారం సిర్గాపూర్ కేజీబీవీని తనిఖీ చేసి సిబ్బందిని విడివిడిగా విచారించినట్లు తెలిసింది. ప్రత్యేకాధికారితో మీకేమైనా ఇబ్బందులు ఉంటే రాతపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని వారు సిబ్బందికి హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం సిబ్బంది తమ దృష్టికి తీసుకువచ్చిన అంశాలను జిల్లా విద్యాధికారికి నివేదిక రూపంలో సమర్పించనున్నట్లు వారు బోధన సిబ్బందికి చెప్పినట్లు సమాచారం. ఇదిలాఉండగా చాలాఏళ్లుగా సిర్గాపూర్ కేజీబీవీ ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న లలితను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని స్థానికులు కూడా అధికారులకు విన్నవించారని తెలిసింది. ఈ విషయమై మండల విద్యాధికారి శంకర్‌ను వివరణ కోరగా సిర్గాపూర్ కేజీబీవీ బోధన సిబ్బంది ఫిర్యాదుపై జిల్లా అధికారులు విచారణకు వచ్చిన మాట వాస్తవమేనని, సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు పర్యటన ఉన్నందున తనకు పూర్తి వివరాలు తెలియవని ఆయన సమాధానమిచ్చారు.

టీఎస్‌పీఎస్‌సీ ఫలితాల్లో నరేష్‌కు 461 ర్యాంక్


కటిక నరేష్

వర్గల్, ఆగస్టు 3: వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన కటిక నరేష్ శనివారం టీఎస్‌పీఎస్‌సీ వెల్లడించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ ఫలితాల్లో రాష్ట్రంలోని మల్టీజోన్ వన్ కేటగిరీలో 461 జనరల్ ర్యాంక్, బీసీ-డీ విభాగంలో... 450 మార్కులు సాధించి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎంపికయ్యాడు. నరేష్ వర్గల్ మండలం, అంబర్‌పేటలో ప్రాథమిక, మినాజీపేటలో ఉన్నత విద్యాభ్యాసం చదువుకున్నాడు. ఇంటర్మీడియట్ ఎమ్మెన్నార్ జూనియర్ కళాశాల (మియాపూర్). దూలపల్లి సెంట్ మార్టిన్‌లో ఇంజనీరింగ్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ విద్యనభ్యసించాడు. నరేష్ ఎంపిక కావడం పట్ల కుటుంబసభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

- భవనం పైనుంచి పడి ఒకరు, రోడ్డు ప్రమాదంలో మరొకరు


శ్యాంబాబు మృతదేహం, తీవ్రంగా గాయపడిన బోస్

పుల్‌కల్, ఆగస్టు 3: ఉమ్మడి పుల్కల్ మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం వేర్వేరుగా జరిగిన ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. పుల్‌కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం శివంపేటలో మతిస్థిమితం లేని వ్యక్తి కొంతకాలంగా ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రయాణికులు పోలీసులకు సమాచారమందించారు. విషయం తెలుసుకున్న ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ముద్దలుగా ఉన్న మృతదేహాన్ని పారతో ఎత్తుకుని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భవనం పైనుంచి పడి తాపీమేస్త్రీ...

భవనం పైనుంచి పడి ఓ తాపీమేస్త్రీ మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పొదిలి మండలానికి చెందిన వరికుంట్ల శ్యాంబాబు(35), కొమ్ము బోస్(30) మండల కేంద్రమైన చౌటకూర్‌లో పార్కుల రాంరెడ్డి ఇంటి నిర్మాణ పనులను జయరాం అనే మేస్త్రీ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. అతని వద్ద వీరు పనిచేస్తున్నారు. శనివారం ఉదయం రెండో అంతస్తు పైకి ఎక్కి గోవపై నిలబడి ప్లాస్టింగ్ పనులు చేపడుతున్నారు. అదుపుతప్పి కింద పడటంతో వరికుంట్ల శ్యాంబాబు తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఇదే ఘటనలో కొమ్ము బోస్ కాలు, చేతులకు తీవ్రగాయాలు కావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో భద్రపర్చారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట క్రైం, ఆగస్టు 3: అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కొత్త బాబు(25) వాషింగ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నిరోజులుగా పనులు లేనందున కుటుంబం గడవడానికి అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక 1న గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శనివారం భార్య ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులపై ఎంపీ రఘునందన్‌రావు ఆరా

రామచంద్రాపురం, ఆగస్టు 3: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీ రఘునందన్‌రావు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కమిషనర్ సంగారెడ్డితో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా షైపేర్ రోడ్డు ఎందుకు పూర్తికాలేదు. భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై విచారించారు. అలాగే టీ-5 జోన్‌లోని భూముల వివరాలను ఎంపీ సేకరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మెప్మా ఉత్పత్తుల ప్రదర్శనను ఎంపీ, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎస్.రాజు తదితరులతో కలిసి ఎంపీ ప్రారంభించారు.


మెప్మా ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కమిషనర్

అమ్మ పాలు అమృతం

● అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు.. అన్నప్రాసన, అవగాహన ర్యాలీలు



మెదక్‌లోని పిట్లం బేస్‌లో గర్భిణులు, బాలింతలతో జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజి

మెదక్ కల్చరల్ ఆగస్టు 3: తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. శనివారం మెదక్ పట్టణంలోని పిట్లం బేస్లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి (పీడీ) బ్రహ్మాజి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమ్మ పాలు అమృతంలాంటివని పుట్టినబిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం ఉచిత పాఠశాల విద్యాబోధన జరుగుతోందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం వల్ల పిల్లలకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, కౌమారదశలోని బాలికలకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నామని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సీడీపీవో నీలిమ కిరణ్, సూపర్‌వైజర్ జయంతి, పోషణ అభియాన్ జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్ మహేష్ రామవత్, కౌన్సిలర్ గాయత్రి, అంగన్వాడీ టీచర్లు రేణుక, స్మరణ, మహిళా శక్తి కేంద్రం బాధ్యులు సంతోషిణి, సఖి సెంటర్ బాధ్యులు రేణుక, ఆశా వర్కర్ మంజుల, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని పూసల గల్లి, అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరమని బాలింతలకు, గర్భిణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరళ పాల్గొన్నారు.



పెద్దశంకరంపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమం

● నర్సాపూర్: నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ సూపర్‌వైజర్ సరళ మాట్లాడుతూ ముర్రుపాలు బిడ్డకు జీవితాంతం రోగ నిరోధక శక్తి ఇస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కాన్పు అయిన మహిళలకు పాలు పట్టే విధానంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో రెడ్డిపల్లి సూపర్‌వైజర్ సుజాత, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● తూప్రాన్/మనోహరాబాద్: తూప్రాన్ పరిధిలోని తూప్రాన్, మల్కాపూర్ గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మల్కాపూర్‌లో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతాదేవీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మనోహరాబాద్ మండలకేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మెహతాబేగం ఆధ్వర్యంలో దండుపల్లి. జీడీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం దండుపల్లిలో ర్యాలీ నిర్వహించారు. వారోత్సవాల్లో టీచర్ జ్యోతి, ఇందిరా, ఏఎన్ఎంలు శ్యామల, వెంటలక్ష్మీ, లావణ్య, స్వర్ణలత, మెడికల్ ఆఫీసర్ పద్మ కుమారి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



మాసాయిపేట: తల్లిపాల వారోత్సవాల్లో చిన్నారులు, తల్లులతో అవగాహన ర్యాలీ

●మాసాయిపేట: మండల కేంద్రంలోన్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో తల్లిపాల ప్రాధాన్యంపై గర్భిణు లకు అవగాహన కల్పించారు.

● నిజాంపేట: మండలంలోని కల్వకుంట గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు ఫర్హానా, పద్మ, లలిత, రాజమౌళి, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

●హవేళీఘణపూర్: మండలంలోని కూచన్‌పల్లి అంగన్‌వాడి కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ భాగ్యలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు శోభ, రుక్మిణి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

● చేగుంట: మండలంలోని రెడ్డిపల్లి, పోలంపల్లి, గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. పోలంపల్లి అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో చేగుంట వైద్యాధికారి అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు మొదటి 6 నెలలు వరకు తల్లి పాలు పట్టాలన్నారు. ఆ తర్వాత ఇంట్లో వండిన అదనపు ఆహారంతో పాటు రెండేళ్ల వయస్సు వచ్చేవరకు బిడ్డకు తల్లి పాలు పట్టాలన్నారు. దీంతో పాటు సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంపత్, వైద్య సబ్బంది నాగమణి, కిరణ్ కుమారి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.



తూప్రాన్: మల్కాపూర్ గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

● చిన్నశంకరంపేట: మండలంలోని జంగరాయి, గవ్వపల్లి, ఖాజాపూర్, శాలిపేట తదితర గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● రామాయంపేట: పుట్టిన శిశువులకు తల్లి పాలు అందించటం అవసరమని రామాయంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సృజన సూచించారు. శనివారం ఆమె మండల పరిధి రాయిలాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ, అంగన్ వాడీ కార్యకర్తలు ఉన్నారు.

● నారాయణఖేడ్: మండలంలోని అనంత్‌సాగర్, బంద్రాన్‌పల్లి, గౌరారాం తండా అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు మంగళ, ప్రేమలత, అంజమ్మ, అనుషాబాయి గర్భిణులకు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు.

ఇదో రకం ఆలవెన్సా?



సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు తన ఇంటిలో ఎలక్ట్రిక్ బైక్‌కు కరెంట్ చార్జింగ్ పెడితే బిల్ పడుతుందనుకున్నాడేమో... శనివారం పాఠశాలకు వచ్చి ఆఫీస్ రూంలో ఉన్న స్విచ్ బోర్డుకు గుట్టు చప్పుడు కాకుండా కిటికి పక్కన బైక్‌ను చార్జింగ్‌కు పెట్టాడు. గురుకుల పాఠశాలకు వెళ్లిన ఆంధ్రజ్యోతి కెమెరాకు ఈ దృశ్యం చిక్కింది. ఇది గమనించిన వెంటనే సదరు ఉపాధ్యాయుడు కరెంట్ స్విచ్‌ను తీసేశాడు. - మునిపల్లి, ఆగస్టు 3

వాలు తండాలో గంజాయి మొక్కల ధ్వంసం

నాగల్‌గిద్ద, ఆగస్టు 3: పత్తిపంటలో గుట్టు చప్పుడు కాకుండా సాగు చేస్తున్న 28 గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు. శనివారం ఎస్ఐసాయిలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని వాలు తండాకు చెందిన పవార్ కాశీనాథ్ తన వ్యవసాయ భూమిలో పత్తిపంటలోగంజాయి సాగు చేస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పత్తిపంటలో సాగవుతున్న 28 గంజాయి మొక్కలను పరిశీలించి స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్టు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన శివశంకర్

శివ్వంపేట, ఆగస్టు 3: ద్విచక్ర వాహనం, కారు, ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ సంఘటన శివ్వంపేటలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసలుఉ తెలిపిన వివరాల ప్రకారం.. గంగయ్యపల్లి గ్రామానికి చెందిన శివశంకర్ ద్విచక్రవాహనంపై నర్సాపూర్ వైపు నుంచి గంగయ్యపల్లికి వస్తుండగా శివ్వంపేట ఇండియన్ బ్యాంక్ వద్దకు రాగానే రాగానే యూటర్న్ చేస్తున్న కారును బైక్ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శివశంకర్ తలకు తీవ్ర గాయాలై చెవి, ముక్కులో నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమించింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాళ్లకల్‌లో వ్యక్తి అదృశ్యం



వెంకటేశ్వరరావు

మనోహరాబాద్, ఆగస్టు 3: కాళ్లకల్ మేజర్ గ్రామపంచాయతీకి చెందిన ఓ వ్యక్తి శనివారం అదృశ్యమయ్యాడు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. 15ఏళ్ల క్రితం ఈస్ట్ గోదావరి నుంచి ఇద్దరు అన్నదమ్ములు వెంకటేశ్వర రావు, కోడూరి రాజు బతుకు తెరువు కోసం కాళ్లకల్ గ్రామం వచ్చి, ఇక్కడే అద్దె గదిలో ఉంటూ తూప్రాన్‌లో కొబ్బరి కాయల అమ్ముకుంటూ జీవిస్తున్నారు. గత మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అన్న వెంకటేశ్వరరావు(32) తిరిగి రాకపోవడంతో తమ్ముడు రాజు చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోయింది. మేడ్చల్ బస్టాండ్ వద్ద బైక్ పెట్టి వెళ్లిపోయినట్టు తెలిపారు. సుమారు 5.5 అడుగుల ఎత్తు కలడని చామన్ చాయ కలర్ షర్ట్ ఉందని చెప్పారు. తమ్ముడు రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పగిడిపల్లిలో వృద్ధుడు..



వెంకటేశ్వరరావు

నారాయణఖేడ్,ఆగస్టు 3: పెన్షన్‌డబ్బులు తీసుకువస్తానని ఇంటి నుండి వెళ్లిన వ్యక్తికి తిరిగి రాక పోవడంతో కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి శనివారం తెలిపారు. పగిడిపల్లి గ్రామానికి చెందిన మంగ మాణయ్య (60)గత నెల 26న పెన్షన్ డబ్బులు తీసుకు వస్తానని ఖేడ్‌కు వెళ్లి తిరిగి రాలేదని, దీంతో బంధువుల వద్ద, తెలిసిన వారి వద్దవెతికినప్పటికీ, ఆయన ఆచూకి లభించక పోవడంతో భార్య నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కలను ధ్వంసం చేసిన దుండగులు

అల్లాదుర్గం, ఆగస్టు 3: మండలంలోని గడిపెద్దాపూర్ గిరిజన తండా సమీపంలో వనమహోత్సం కార్యక్రమంలో నాటిన మొక్కలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాల్చివేశారని తండావాసులు తెలిపారు. ఈ ఘటనపై తండావాసులు శనివారం అధికారులకు ఫిర్యాదు చేయగా మండల అధికారులు విచారణ జరిపారు. మద్యం మత్తులో ఓ రైతు పీకివేశాడని, ఈ మొక్కలను తిరిగి నాటిస్తామని ఆ రైతు కుటుంబ సభ్యులు తెలిపినట్లు అధికారులు తెలిపారు. వనమహోత్సంలో నాటిన మొక్కలను ధ్వంసం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఖేడ్ కస్తూర్బా పాఠశాలను సందర్శించిన డీఈవో

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/కంగ్టి ఆగస్టు 3: ఖేడ్ కసూర్బా విద్యాలయాన్ని శనివారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టుల్లో ఎలా బోధిస్తున్నారని విద్యార్థినులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. వంట సరుకులకు సంబంధించిన స్టాక్ గదిని తనిఖీ చేశారు. నాగల్‌గిద్ద మండల కేంద్రంలో ఏర్పాటు కానున్న కేజీబీవీ హాస్టల్ భవనాన్ని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. భవనంలోని గదులను పరిశీలించడంతోపాటు నీటిసౌకర్యం విద్యుత్ సౌకర్యాలను పరిశీలించారు. అనంతరంస్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు సంబంధించిన శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, నాయకులు ఉన్నారు. అదే విధంగా కంగ్టిమండలంలోని కంగ్టి ప్రాథమిక, ఉన్నతపాఠశాలతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్నభోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలుసలహాలు, సూచనలు చేశారు. అనంతరం కంగ్టిలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల సముదాయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను పెంపొందించాలి'

మాసాయిపేట/చిన్నశంకరంపేట, ఆగస్టు 3: విద్యార్థుల్లో అభ్యసన ప్రతిభా సామర్థ్యాలను వెలికి తీయాలని పాఠశాలలో ప్రతీ విద్యార్థి పై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం మాసాయిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు మండలాల పాఠశాలల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ఒక్కరోజు కాంప్లెక్స్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతతో పాటు ప్రతిభా సామర్థ్యాలను అభ్యసన పద్ధతిలో రాబట్టాలని, ప్రతి ఉపాధ్యాయుడు ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని రాధాకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాసాయిపేట కాంప్లెక్స్ ఉపాధ్యాయులు రంగారెడ్డి రాజేశ్వరరావు ఆంజనేయులు వివిధ మండలాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. అదేవిధంగా చిన్నశంకరంపేట, సూరారం హైస్కూళ్లలో ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా డీఈవో రాధాకిషన్ హాజరై మాట్లాడారు. బయోసైన్స్ పట్ల విద్యార్థులను ప్రోత్సహించాలని డీఈవో ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దీప్లా నాయక్, సాయిరెడ్డి, ఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి: టీపీటీఎఫ్

కంది, ఆగస్టు 3 : విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల కొరత తీర్చాలని టీపీటీఎస్ (తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర కౌన్సిలర్ ఎం.సోమశేఖర్ డిమాండ్ చేశారు. టీపీటీఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా కంది పండలంలోని పలు పాఠశాల్లో శనివారం ఉపాధ్యాయులు టీపీటీఎఫ్ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ చేర్యాల జడ్పీహెచ్ఎస్, సీపీఎస్, ఎంపీపీఎస్ ఓడీఎఫ్, ఎంపీపీఎఫ్ మామిడిపల్లి గ్రామాల్లో ఉపాధ్యాయుల కొరత వెంటనే తీర్చాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, సోమశేఖర్, ఎండీ ఖరోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

'రాళ్లకత్వలో స్టోన్ క్రషర్ పనులు నిలిపి వేయాలి'

జిన్నారం, ఆగస్టు 3: జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న నూతన స్టోన్ క్రషర్ పనులు వెంటనే నిలిపి వేయాలని గ్రామస్థులు అదనపు కలెక్టర్, ఆర్డీవో, వివిధ శాఖల అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్ మాధురి సహా ఆర్డీవో, ఇరిగేషన్, మైనింగ్ కార్యాలయాలలో స్టోన్‌క్రషర్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఫిర్యాదు చేశారు.

కొల్లూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన కమిషనర్

రామచంద్రాపురం, ఆగస్టు 3: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కొల్లూరు పోలీస్‌స్టేషన్‌ను కమిషనర్ అవినాష్ మహంతి శనివారం పరిశీలించారు. ఎస్‌హెచ్ సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు కమిషనర్‌కు స్వాగతం పలికారు. స్టేషన్‌లో వసతులపై ఆరాతీసిన కమిషనర్ పలు సూచనలు చేశారు.

6 న సదరం స్లాట్ బుకింగ్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3 : దివ్యాంగులను గుర్తించే సదరం క్యాంపును ఈ నెల 13 న సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన స్లాట్లను ఈ నెల 6వ తేదీన కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల12 వరకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3 : ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 12 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 10 వ తరగతి ఉత్తీర్ణులైన 14 ఏళ్లు నిండి అభ్యర్థులు వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు.

నర్సాపూర్ మాజీ ఉపసర్పచ్ అంత్యక్రియల్లో సునితారెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 3: నర్సాపూర్ మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు టి.వెంకటేష్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించగా శనివారం నర్సాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై పూర్తయ్యే వరకు ఉండి ఆ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంత్యక్రియలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ హబీబ్‌ఖాన్, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కిష్టారెడ్డిపేట గ్రామ సమస్యలపై బీజేపీ నాయకుల ఆందోళన

పటాన్‌చెరు, ఆగస్టు 3: మండలంలోని కిష్టారెడ్డిపేటలో సరైన మౌళిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించడం లేదని మండల బీజేపీ అధ్యక్షుడు ఈర్ల రాజు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు పంచాయతీ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, అక్రమకట్టడాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. అనంతరం కార్యదర్శి రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు.

సైకిల్ వీల్‌తో కలుపు యంత్రం



కలుపు తీస్తున్న వెలిమెల రైతు కృష్ణ

రామచంద్రాపురం, ఆగస్టు 3: రామచంద్రాపురంలోని వెలిమెలలో ఓ రైతు సైకిల్ చక్రంతో దంతె (కలుపుతీసే) యంత్రాన్ని తయారు చేశాడు. ముందు భాగంలో ఇనుప చువ్వలతో పళ్ల మాదిరిగా ఏర్పాటు చేసి, దానికి రెండువైపుల ఇనుప ఫ్రేమ్‌తో సపోర్టు తీసుకుని ఈ మొత్తాన్ని పిల్లలు ఆడుకునే సైకిల్ చక్రానికి అమర్చాడు. ఈ భాగాన్ని ముందుకు తోయడానికి హ్యాండిల్ అమర్చుకున్నాడు. ఈ యంత్రం ఎంతగానో ఉపయోగకరంగా ఉందని రైతు కృష్ణ తెలిపాడు.

ఎస్సీ వర్గీకరణతో ప్రయోజనం

జహీరాబాద్, ఆగస్టు 3: ఎస్సీవర్గీకరణతో మాదిగలకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుందని మాజీమంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆయన కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు ఘనంగ సంబురాలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు చంద్రశేఖర్ కార్యాలయం వద్ద టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు.

'పచ్చదనం-స్వచ్ఛదనం'ను విజయవంతం చేయాలి



తూప్రాన్ మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతి

జహీరాబాద్, ఆగస్టు 3: ఈ నెల 5నుంచి 9వ తేదీవరకు గ్రామాలవారీగ పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఎంపీడీవో మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పచ్చదనం-స్వచ్ఛదనం గ్రామాల్లో అమలుచేసే విధానంపై చర్చించారు.ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయంసహాయక బృందాల సభ్యులు, నాయకులు, యువజనసంఘాల సభ్యులను కమిటీగా ఏర్పాటుచేసుకుని సమావేశం నిర్వహించి ర్యాలీలు చేపడతామన్నారు. ఈ నెల 5న సమావేశం ఏర్పాటుచేసి కమిటీల ఏర్పాటు, ర్యాలీలు ఉంటాయన్నారు. 6నతాగునీరు, వర్షపునీరు సంరక్షణ, 8న ఆరోగ్యం, వీధికుక్కల బెడదపై దృష్టి, 9న గ్రామాల్లో ప్రభుత్వస్థలాల్లో, బహిరంగ ప్రదేశాల శుభ్రత, తదితర కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● కోహీర్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భారతి శనివారం పచ్చదనం- స్వచ్ఛదనం కార్యక్రమానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఈ నెల 5 తేదీన స్థానిక నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువకులు, వార్డు కమిటీలతో సమావేశం, ర్యాలీ నిర్వహించాలన్నారు. 6,7,8 తేదీల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

● రామాయంపేట: ప్రస్తుత సీజన్లో అన్ని చోట్లా పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ ఆదేశించారు. స్థానిక వార్డు అధికారులు, ఆర్‌పీ సిబ్బంది, ఆశా వర్కర్లతో పారిశుధ్య నిర్వహణపై శనివారం ప్రత్యేక సమావేశమయ్యారు. పలు సూచనలు చేశారు.

● తూప్రాన్: తూప్రాన్ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పచ్చదనం- స్వచ్ఛదనం కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ నెల 5 నుంచి 9 తేదీ వరకు రోజువారీగా చేయాల్సిన కార్యక్రమాల గురించి మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు, మెప్మా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పీడీ మెప్మా ఇందిర, మున్సిపల్ మేనేజర్ రఘునందన్, శ్రీనిధి అధికారి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ చింతల మధు, వార్డు ఆఫీసర్లు, మెప్మా ఓబీలు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

● కంగ్టి, ఆగస్టు 3: మండలంలో వివిధ గ్రామాల్లో నిర్వహించే పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సత్తయ్య శనివారం శనివారం ఒక ప్రకటనలో కోరారు.

మహిళలు మాతృమూర్తులే కాదు.. శక్తి స్వరూపులు

● జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి కె.లలితకుమారి



గుమ్మడిదల రైతు వేదికలో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ లలిత కుమారి

గుమ్మడిదల, ఆగస్టు 3: మహిళలు మాతృమూర్తులే కాదు బిడ్డకు జన్మనిచ్చే సాక్షాత్ శక్తి స్వరూపులని జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ ఆఫీసర్ లలిత కుమారి పేర్కొన్నారు శనివారం మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ,మహిళా సాధికారత కేంద్రం అధ్వర్యంలో మిషన్ శక్తి వంద రోజుల స్పెషల్ కార్యక్రమంలో భాగంగా గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారితో పాటు డీఎల్పీవో అమృత, డీఆర్డీవో జంగారెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి తహసీల్దార్ గంగాభవాని, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలు దేనిలో కూడా తక్కువ కాదని, పురుషులతో సమానంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అత్యున్నత చట్టసభలలో చట్టాలు రూపొందించే శక్తి కలిగిన మహిళలకు అవకాశం కల్పించాలన్నారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ అమ్మాయిలకు 21 సంవత్సరం నిండిన తర్వాతనే పెళ్లి చేయాలని, మహిళలు అన్ని రంగాలలో రాణించే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సహించినప్పటికీ అక్కడక్కడా కొన్ని కారణాలవల్ల అనుకోని ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆడబిడ్డ పుడితే ఒక రకంగా, మగ బిడ్డ పుడితే మరొ రకంగా చూసే తల్లిదండ్రులకు ఉన్నత స్థాయిలో ఉన్నటువంటి మహిళలంతా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో దయాకర్‌రావు, డీఆర్డీవో అసిస్టెంట్ డైరెక్టర్ జంగారెడ్డి, సీడీపీవో జైరాం నాయక్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, మండల సమాఖ్య ప్రెసిడెంట్ అనురాధ, ఏపీఎం శివ శంకర్, సెక్రెటరీ ప్రభాకర్, పోషణ అభియాన్ సమన్వయ కర్త సౌమ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ టీచర్స్ ఆశలు తదితరులు పాల్గొన్నారు.

19 గ్రామాలకు కొత్త కార్యదర్శులు.. మరో పదింటిలో పాతవాళ్లే

సదాశివపేట, ఆగస్టు 3: మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీల్లో 19 పంచాయతీలకు కొత్త కార్యదర్శులు వచ్చారు. ఈ మేరకు వారు బాధ్యతలు సైతం స్వీకరించారు. మిగతా 10 గ్రామ పంచాయతీల్లో (దీర్ఘ కాలికంగా) విధులు నిర్వర్తించిన పాత కార్యదర్శుల్లో కొందరు తిరిగి ఇది వరకే తాము పనిచేసిన గ్రామ పంచాయితీల్లోనే కొనసాగుతుండగా మరి కొందరు కార్యదర్శులు ఇదే మండలంలో ఇతర గ్రామ పంచాయతీల్లోకి మారారు.

కొత్త కార్యదర్శులు వీరే...

అంకెనపల్లి కార్యదర్శిగా ఎం.మల్లేశంగౌడ్, ఆరూర్‌కు పి.మహేశ్వరి, ఆత్మకూర్‌కు పి. శ్రీనివాసులు, చందాపూర్‌కు ఎన్.స్వరాజ్ కుమార్), ఎన్కెపల్లికి ఎం.శ్రీకాంత్, ఏటిగడ్డసంగంకు పి.స్వప్నాగౌడ్, ఇశ్రితాబాద్‌కు కె.నర్సింహులు, కంబాలపల్లికి బి.స్వరూప, కొల్కూర్‌కు జి.లక్ష్మీనారాయణ, మాచిరెడ్డిపల్లికి ఎం.నర్సింలు, మద్దికుంటకు ఏ.వనితాగాయత్రి, మాలపాడుకు ఏ.చంద్రలీల, మెలిగిరిపేటకు ఏ.రాములు, ముబారక్‌పూర్‌కు ఎస్.వనజ, పెద్దాపూర్‌కు ఎల్.పాపయ్య రేజింతల్‌కు వి.లక్ష్మణ్, తంగడపల్లికి కె.గీతాంజలి, వెంకటాపూర్‌కు ఎం.డి.ఇమ్రాన్, ఎల్లారం గ్రామానికి ఎం.ప్రణయ జ్యోతి కొత్త కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

కొనసాగుతున్న పాత కార్యదర్శులు

వెల్టూర్‌కు టి.అనీల్‌కుమార్, సూరారం గ్రామానికి టి.మల్లిఖార్జున్, పొట్టిపల్లికి కె.గణేష్, నిజాంపూర్‌కు ఏ.ప్రదీప్‌కుమార్, నాగుపల్లికి జి.శ్రవంతి, నాగ్‌సాన్‌పల్లికి జి.శ్రీకాంత్‌రెడ్డి, కోనాపూర్‌కు పి.మహేశ్వరీ, గొల్లగూడెంకు ఎం.రాజేష్ యాదవ్, బొబ్బిలిగాంకు ఏ.చంద్రలీల పాత కార్యదర్శులుగా కొనసాగుతున్నారు.

మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

జిన్నారం, ఆగస్టు 3: బొల్లారం మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చైర్ పర్సన్ రోజారాణి పేర్కొన్నారు. శనివారం 6వ వార్డు బాలాజీనగర్‌లో నూతన సీసీ రోడ్డు పనులను చైర్ పర్సన్ రోజారాణి ప్రారంభించారు. ప్రధాన రహదారులు సహా పలు కాలనీల్లో నూతనంగా సీసీరోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కంది, ఆగస్టు 3 : మండలంలో పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు శనివారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. కందిలో మండల పంచాయతీ అధికారి మహేందర్‌రెడ్డి, కార్యదర్శి విద్యాధర్ అన్ని వీధుల్లో చెత్తా చెదారాన్ని, ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. మురుగు కాల్వల్లో పూడిక తీయించారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి విద్యార్థులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌తో ఉద్యోగ సంఘం కార్యవర్గ సభ్యులు

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3 : తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వి.శేషానాయక్, కార్యదర్శిగా డి.దిలీప్‌కుమార్, కోశాధికారిగా బి.రాములు, ఉపాధ్యక్షులుగా సాజిద్, ఫరీద్, సహాయ అధ్యక్షుడిగా అఫ్జర్, సంయుక్త కార్యదర్శులుగా శ్రవణ్‌కుమార్, బీరయ్య, కార్యనిర్వహణ కార్యదర్శిగా సందీప్, ప్రచార కార్యదర్శిగా భాస్కర్, ఆఫీస్ కార్యదర్శిగా విజయ్, కార్యవర్గ సభ్యులుగా మంగలక్ష్మి, భూపాల్‌గౌడ్, విద్యాసాగర్, అరుణ, వరప్రసాద్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గం జిల్లా కలెక్టర్ క్రాంతిని పుష్పగుచ్ఛంతో మర్యాదపూర్వకంగా కలిసి ప్రొసీడింగ్ కాపీని అందజేశారు.

సమస్యలను అధిగమించడానికే చట్టాలు

● మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరీ క్రిష్ణ

జహీరాబాద్, ఆగస్టు 3: సమస్యలను అధిగమించడానికి చట్టాలు దోహదపడుతాయని సీనియర్ సివిల్‌జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరీక్రిష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతు విద్యార్థులకు చట్టాలపై అవగాహన అత్యవసరమని చెప్పారు. పోక్సో, సమాచారహక్కుచట్టం, మోటారు వాహనాల చట్టం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నిరోధకచట్టం, జువైనెల్ జస్టిస్‌చట్టం, ఉచితన్యాయసేవ సహాయం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహనదారులు లైసెన్సులు లేకుండా వాహనాలను నడుపకూడదన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు మాణెన్న, న్యాయవాదులు సోమశేఖర్, రుద్రయ్యస్వామి, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలెంటీర్లు, కళాశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటను పరిశీలించిన డీఆర్డీవో

నిజాంపేట, ఆగస్టు 3: మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో డీఆర్డీవో శ్రీనివాస్ రావు మామిడి తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు పెరిగేందుకు పాంపాండ్స్ ఎంతో మేలు చేస్తాయన్నారు. అనంతరం మామిడి తోటను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఏపీవో శ్రీనివాస్, కార్యదర్శి నరసింహ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్కూలు బ్యాగులు పంపిణీ



విద్యార్థులకు స్కూలు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 3 : మండలంలోని రుద్రారం ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు గాయత్రి పాండు యువసేన సభ్యులు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిల్స్, ఉపాధ్యాయులకు కుర్చీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గాయత్రి పాండు, కుశాల్ కుమార్, లోహిత్ కుమార్, అక్షిత్ ,మహేష్, బాలు ,మరియు గ్రామ యువకులు వివిధ సంఘాల యువకులు, తదితరులు పాల్గొన్నారు

డ్రం సీడర్ విధానంతో విత్తుకోవాలి

● నత్నయపల్లి వ్యవసాయ పరిశోధనాశాల శాస్త్రవేత్త శోభ

నర్సాపూర్, ఆగస్టు 3: జూన్‌లో ఆశించిన వర్షాలు లేక నాట్లు ఆలస్యం అయినందున ఇంకా నార్లు పోయని ప్రాంతాల్లో రైతులు వెదజల్లే డ్రం సీడర్ పద్ధతిన విత్తుకోవడం మంచిదని నత్నయపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ప్రొఫెసర్ శోభ సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వరి నాట్లు పోయడం, నాటు వేయడం ఆలస్యం అయ్యే కొద్ది రకాలను బట్టి దిగుబడి తగ్గడమే కాకుండా చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. సాధారణంగా ఆగస్టు మాసం నుండి వరి పంటలో చీడపీడలు ఆశించే అవకాశం ఉంది కనుక ఈ మాసం నుంచి చీడపీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె పేర్కొన్నారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు మందులు పిచికారి చేయాలన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి రూ.లక్షన్నర విరాళం

జిన్నారం, ఆగస్టు 3: బొల్లారంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ ఆలయానికి వీవీఆర్ ఫౌండేషన్ తరుపున రూ. లక్షా50వేల విరాళం అందజేశారు. శనివారం బీసీ కాలనీలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ ఆలయం, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు వీవీఆర్ ఫౌండేషన్ తరుపున నాయకులు వరప్రసాద్‌రెడ్డి రూ. లక్షా50వేలను విరాళంగా ఆలయ బాధ్యులకు అందజేశారు.